



# ఇందిర

**ఇం**తకీ వాళ్ళిద్దరూ పక్కపక్క యింటివాళ్ళయినా కమలా, మోహన్‌లు కాదు. ఆ అమ్మాయి పేరు యిందిరా, ఆ అబ్బాయి పేరు సుందర్రావూను. యీ కారణంచేత ఆ యిద్దరికీ ప్రేమ ఎప్పుడు ఏ సందర్భంలో అంకురించిందో, చిగురించిందో కచ్చితంగా చెప్పడం కష్టం.

ఆ అమ్మాయి - యిందిరే చిన్నప్పుడు తరుచుగా సుందర్రావు వాళ్ళింటికి ఆడుకునేందుకు వచ్చేది. ఆ పక్కపక్క యిళ్లు రెండూ పూరిళ్ళు. దాదాపు బీద సంసారాలే అని చెప్పాలి.

సుందర్రావు వాళ్ళింటి పెరట్లో ఆవుకు కుడితిపెట్టే పెద్దగాబు వుండేది. ఆ గాబు చుట్టూ ఏ కాలమూ తేమగా వుండటంతో - పచ్చని పచ్చిగడ్డి పెరుగుతుండేది. ఆ పచ్చిగడ్డిలో కూర్చుని ఆడుకోవటం, అక్కడ దొరికే తడిమట్టితో బొమ్మల్నీ, బొంగరాల్నీ చేసుకుని ఆనందించటం యిందిరకూ, సుందరానికీ సరదా.

అందుకు యిది సూచనే కావొచ్చు! అయినా ఇదమిత్థం అని చెప్పలేం. సుందరానికి ఆరేళ్ళూ,

యిందిరకు ఐదేళ్ళూ - ఆ వయసులో ఆడుకుంటున్న వాళ్ళిద్దరికీ ఎందుకో పోట్లాట వచ్చింది. సుందరం సాచి యిందిరకో లెంపకాయ యిచ్చాడు. అటునుంచి వాళ్ళమ్మా, యిటునుంచి వీళ్ళమ్మా వచ్చి గుక్కపెట్టి ఏడుస్తున్న యిందిరను సముదాయించి, సుందరానికి ఓ లెంపకాయిచ్చారు.

ఆ రాత్రి సుందరం తను తిన్న దెబ్బ బాధని మరిచిపోయి యెందుకో పాపం చాలా బాధపడ్డాడు మనసులో. కారణం అతడికే బాగా తెలీదు. కాని వొహటి - తను మాత్రం యిందిరను కొట్టి తీరని అపచారం చేశానని అతడి హృదయం నానాయాతనా, బాధా పడింది.

తరవాత వీధి బడి. అప్పటికి యిద్దరికి పదీ పదకొండేళ్లు. ఓ సాయంత్రం నాలుగ్గంటలకి వీధి బడిలో పక్కపక్కగా కూచుని, మేదరి తడికె సందుల్లో కుండా లోపలకు గాలి విసురుకు రాల్తున్న తాటిపువ్వు తింటున్నారు.

యిందిర చేయి చాస్తూ, "నాక్కాస్త పువ్వు పెడుదూ?" అని అడిగింది. సుందరం తను అరిచేతులో పెట్టుకుని కొద్దికొద్దిగా తింటున్న తాటిపువ్వును కాస్తా - అంతా యిందిరకి యిచ్చేశాడు. గతుక్కుమని అదోలా యిందిర సుందరం కళ్ళల్లోకి చూసింది. అది ప్రేమ అనలేం. కాని సుందరం గుండెలకి వో రైలింజను గుద్దుకున్నట్టయింది.

"బావుంది యిందిరా! నువ్వు తిను. ఊఁ" అనగలిగాడు సుందరం.

బహుశా అదంతా క్షణికమే! ఆ తరవాత మళ్ళీ యెప్పటి మాదిరిగానే రోజులు దొర్లసాగినై. రోజు బడికి వస్తున్నారు - పోతున్నారు.

కాని వున్నట్టుండి హఠాత్తుగా వో మార్పు వచ్చింది. వూళ్ళో కో ఆపరేటీవ్ బ్యాంక్ స్థాపనా, అందులో యిందిర తండ్రి బాపయ్యకు సెక్రటరీ పదవీ లభించినై.

ఈ మార్పు - యిందిరా సుందరాల జీవితాల్లో మరో పెద్ద మార్పుకు కారణమైంది. ఇందిర తల్లి రమణమ్మ మట్టి పిసుక్కు బతికే కాపుపెళ్ళాం దశ నుంచి, ఉద్యోగస్తుడి భార్య దశకు వెళ్ళిపో యింది. ఇక కూతురు యిందిరకూ అదే ఉన్నత స్థానం.

"ఏమిటీ ఆ మట్టి పిసుక్కునేవాళ్ళతో నీకు స్నేహం? చక్కగా యింగ్లీషు చదువు చదువుకుని వుద్యోగస్తుణ్ణి పెళ్ళాడవలసినదానికి!"

ప్రతిరోజూ సందర్భాసందర్భాల ప్రసక్తే లేకుండా యిందిరకు తల్లి రమణమ్మ యిలా నూరిపోస్తూం డేది. ఇందిర చేత బడి మాన్పించారు. ఇంటి దగ్గర యింగ్లీషు ట్యూషను.

సుందరం ఈ మార్పుకు మొదట తబ్బిబ్బయ్యాడు. 'ఆ అయితే నాకేం! యిందిరని చూడకపోతే నాకు పొయ్యేదేమిటి?' అని కూడా అనుకున్నాడు.

కాని పక్క పక్క యిళ్లు. ఏదో వేళలో యింటి కిటికిలో నుంచో, ద్వారంలోంచో యిందిర తళుక్కుమని సుందరం కంట పడుతూండేది.

ఎప్పుడన్నా దారిలో ఎదురైతే బాపనయ్య కూడా - "ఏంరా అల్లుడూ! బాగా చదువుకుంటున్నావా? అమ్మాయిని చూసేందుకైనా రావటంలేదేం?'' అని, సుందరం జవాబు ఏం చెప్పాలో ఆలోచించేలోపలే... "అయినా పెద్దవాళ్లయారుగా! ఆఁ....' అని నవ్వేస్తుండేవాడు.

రమణమ్మ అందమైన మనిషి. కూతురు యిందిర తల్లికన్న మరికాస్త ఎర్రని శరీరచ్ఛాయతో, తీర్చిదిద్దినట్టుండే అవయవసౌష్టవంతో పెరిగి పెద్దదవుతోంది. పెద్ద వుద్యోగస్థుణ్ణి, లేకపోతే బాగా డబ్బున్నవాణ్ణి అల్లుడుగా చేసుకోవాలని రమణమ్మ ఆరాటం. తన అందచందాలకు తగినవాణ్ణి తాను వివాహం ఆడలేదనే బాధతో మొదటి నుంచీ కుమిలిపోతున్న రమణమ్మకు - కూతుర్నయినా తన చిన్ననాటి కోర్కెల్లో, వూహల్లో కదిలిన కాల్పనిక వ్యక్తి కిచ్చి చేయాలనేది జీవితధ్యేయం అయిపోయింది.

కూతుర్ని ప్రతి సినిమాకీ, నాటకానికీ వెంటపెట్టుకుని తీసుకుపోవటం అచ్చంగా సినిమాస్టార్‌లా అలంకరించటం - ఆ చుట్టుపట్ల చాలామందికి ఆశ్చర్యంగా వుండేది.

“నూరు రూపాయిల మొగుడి సంపాదనతో, కూతుర్ని అచ్చం సినిమాస్టార్‌లా అలంకరించేందుకూ, యింగ్లీషు చదువూ, ఆ సినిమాలూ, నాటకాలూ - అంతా ఎలా జరుపుకొస్తోందీ రమణమ్మ!” అనుకునేవాళ్ళు చాలామంది.

బాపయ్య అదోలాంటి మనిషి. భార్య మాటకు ఎదురుచెప్పటం అనేది ఏనాడూ లేదు. ‘వెయ్యేళ్లు బతకపోయామా? అంతా మూణ్ణాళ్ళ ముచ్చట!’ అనే ధోరణి.

కాలచక్రానికి దొర్లుతూపోవటమే పని. సుందరం స్కూలు ఫైనలులో ఉత్తీర్ణుడయాడు. పురుష లక్షణాలు సంపాదించటానికి ఒక అర్హతను కాలచక్రం ఇచ్చింది అతనికి. పొట్టగడుపుకోటానికే ఉద్యోగం చేయటం తన విధి అని సుందరం అనుకునేవాడు. అదే లోకం కళ్ళకి పురుష లక్షణంగా కనుపిస్తుంది.

బాపయ్య మావ అతనికి ఉద్యోగం ఇప్పించటంలో పెద్ద తోడ్పాటు ఇవ్వలేదు కాని ప్రెసిడెంటు చేతి చలవవల్ల సుందరానికి కోఆపరేటివ్ బ్యాంకిలో గుమాస్తాగిరి దొరికిందని తెలుసుకోగానే బాపయ్య మావ చాలా సంతోషించాడు.

ఇదివరకు ఎప్పుడో వీధిలో తటస్థపడుతుంటే సుందరం బాపయ్య మావయ్యకు నిత్యమూ, అంతేకాదు - పనిచేసే పది గంటల కాలమూ - ఎదురెదురుగా కూచోవలసి వచ్చింది. వయస్సులోనూ, పదవిలోనూ సుందరానికీ పై చెయ్యిగానే బాపయ్య ఉండటంవల్ల మామపై అల్లుడికి చనువులేకపోయింది. ఈ చనువు కూడా కొద్ది రోజులకి చల్లారి పోయింది. కల్పితమైన చుట్టరికం కూడా కరిగి పోయింది.

ఇందుకు కారణం బాపయ్యకే బాగా తెలుసు. సుందరానికి ఉద్యోగం వచ్చిన కొత్తలో బాపయ్యకు అతనిని నిజంగా అల్లుణ్ణి చేసుకోవాలనే కోరిక మనసులో ఓ మూల తలెత్తింది. ఆ కోరిక ఆనాడు అతను ఇంటికి వెళ్ళేవరకు రెపరెపలాడుతుండడం వల్ల భార్యకు భయపడుతూ భయపడుతూ దానిని వెల్లడించాడు. మరుక్షణంలోనే అతని కోరిక అదృశ్యమైంది. భర్త సూచనను అంగీకరించే స్థితిలో రమణమ్మ ఇదివరలో ఏనాడూ లేదు - ఇప్పుడు ఉంటుందనుకోవటం భ్రమ.

ఇందిర పెళ్లి విషయంలో రమణమ్మ పథకం తయారు చేసుకుంటూ వుంది. సిరిసంపదలతో చదువు, సంధ్య అన్నీ వున్నవాడికి కాని తన కూతుర్నిచ్చి పెళ్ళిచేయదలచుకోలేదామె. దేగ

ఆకాశం నుంచి యెర కోసం చూసేటంత నిశితంగా రమణమ్మ ఆ పల్లెకాని పట్టణంలో వరుల కోసం చూస్తూండేది. అక్కడ వున్నవాళ్ళు ఆమెకు నచ్చితే ఆమెకు ఘనతే రాదు.

"పెళ్ళి కాకపోతే పోయె. నా కూతురు నా దగ్గరే వుంటుంది. అది నాకు బరువౌతుందా? నాకు నచ్చిన వరుడు వచ్చే వరకు అది చదువుకుంటూనే వుంటుంది" అని రమణమ్మ – యెవళ్ళయినా కొంప దీసి కూతురు పెళ్ళి గురించి అడిగితే చెప్పాలని – జవాబును సిద్ధం చేసుక్కూచుంది.

కాని, ఎవరూ ఆ విషయం ఆమె వద్ద యెత్తకుండానే ఆమెకు వరుడు, అల్లుడు, అల్లంత దూరానకాక, సమీపంలోనే తటస్థపడ్డాడు. పక్కనున్న మేడలోకే వొక వ్యక్తి యెక్కడ నుంచో పెట్టే బేడా పెద్ద సరంజామాతో దిగటం రమణమ్మ కళ్ళ పడింది. మోకాళ్ళ వరకు తెల్లటి కోటూ, కోటు మీద మెరుస్తున్న బంగారపు రంగు బొత్తాలూ, చేతికి వున్న వేళ్ళన్నిటికి తలొక రెండేసి వుంగరాలు, వాటి రాళ్ళు ప్రసరిస్తున్న కాంతులూ రమణమ్మ కళ్ళలోపడి జ్యోతుల్లా వెలిగాయి.

"రవణమ్మ జన్మ యెప్పుడూ సార్థకమైందే అనుకోండి. మీరు రేపు అతనిని మన ఇంటికి కాఫీకి పిలవండి" అని ఆమె భర్తతో ఆ సాయంకాలమే చెప్పింది.

"ఎవరే అతను?" అని ప్రశ్నించాడు బాపయ్య.

"అబ్బ – ప్రక్క మేడలో దిగిన అబ్బాయి"

"నేనేం చూశాను?"

"ఐతే వోసారి యిప్పుడే పోయి చూసి రాండి" అందామె.

బాపయ్య బతుక్కీ, బండి చక్రాన్ని దొర్లించే యెద్దు బ్రతుక్కీ పెద్ద తేడా యేమి లేదు. పది నిమిషాలలోనే తిరిగి దారం లాగిన గాలిపడగలా భార్య దగ్గరకు వచ్చాడు బాపయ్య.

"వస్తానన్నాడా అతను?"

"అతను అంటావేమిటి? ఆయన అను"

"అంటే...."

"నీకన్న పెద్ద వయసువాడు కదూ"

"ఛీ...మీ మాటలూ మీరూ...నాకన్న పెద్దవాడైతే మాత్రం అల్లుణ్ణి అలా అనకూడదు. ఇంతకీ ఏమిటి అతని సంగతి?"

"నేనాయన్ను ఎరుగుదును. పొద్దున్నే మా బ్యాంకికి వచ్చి రెండు వేల రూపాయల చెక్కుకు డబ్బు పుచ్చుకున్నాడు. వాళ్లది నైజాం. హైదరాబాదులో వర్తకం చేస్తున్నాడల్లే ఉంది. ఇక్కడేవో సరుకులు ఖరీదు చేయటానికి వచ్చాట్ట"

"ఏం సరుకులు కొంటాడండి....వెండి బంగారాలా?...వివరాలు కనుక్కోలేక పోయారా?

"ఈవేళే విడదీసి అడగటం బాగుండదని ఊరుకున్నాను"

"పోనీలెండి...మన అమ్మాయికి తగిన వాడిలాగే ఉన్నాడు. డబ్బూ అదీ బాగా ఉంది అతని దగ్గర – ఆ వేషమే తెలుపుతోంది" అంది రమణమ్మ.

"వయస్సు మాట ఆలోచించావ్?" అన్నాడు బాపయ్య.

"నా మొహం...ఎంత చూసినా అతడికి ముప్ఫయ్యేళ్ళు మించి ఉండవ్...ఐనా కాని వచ్చే ప్రమాదం ఏమీలేదు. మన పిల్లకి సరియైన జోడియే...వయస్సులో ఉన్నవాడని ముష్టివాడికి చేతులారా అమ్మాయిని ఇస్తానా? అది బతికే మూన్నాళ్ళూ రాణిలా బతికే ఉపాయం చూడాలి గాని...వీధుల్లో తిరిగే బికారికి ఇచ్చి దాని బ్రతుకు బండలు చేస్తానా....నాలాగే అదీ తిండికి బట్టకీ ఏడవ కూడదు...."

వారం రోజులు తిరగకుండానే రమణమ్మ కోరిక నెరవేరింది.

నైజాం నుంచి వచ్చిన రాజారావుకి తన కూతురు ఇందిరను ఇచ్చి పెళ్ళి చేసింది. బాపయ్య ఎన్నో తంటాలు పడి ధనికులతో సమమైన వియ్యం అనిపించుకోటానికి రెండు వేల రూపాయల నగలు చేయించి కూతురు మెడకు అలంకరించాడు. రమణమ్మ ఊళ్ళో ఉన్న పెద్దల్నే విందుకు పిలిచి వారి ఎదుట తానూ ఒక లక్ష్మినని నిరూపించుకుంది.

ఇందిర పెళ్ళికి సుందరం రాలేదు. అతనికి నోటిమాట రూపంలో బాపయ్య నుంచి పిలుపు వచ్చిందే కాని, అది అతనికి అంతగా ఉపయోగించలేదు. ఇందిర ఆడపిల్ల. పెళ్ళి కాకుండా యెలా వుంటుంది? ఆమెకు పెళ్ళయింది. నేనెందుకు వెళ్లాలి అనుకుని సుందరం వూరుకున్నాడు.

ఆమెకు పెళ్ళయిన కొత్తలోనే ఇందిర భర్త, రాజారావుతో కలసి వీధుల్లో షికార్లు, సినిమాలు తిరగటం ప్రారంభించింది. రాజారావు చేస్తున్న ఖర్చుకి, చూపుతున్న గౌరవానికి ఇందిరతోబాటు రమణమ్మా గర్విస్తూండేవారు.

రెండు నెలలు రాజారావు అత్తవారింట అన్ని సరదాలు తీర్చుకుని నైజాంలో పెద్ద ఇల్లు చూసి వచ్చిన మీదట ఇందిరను తీసుకుని వెడతానని చెప్పి వూరు విడిచాడు. తెల్లవారిన తరువాత అల్లుడు రాజారావుతోబాటు కూతురు మెడలోని నగలు కూడా అదృశ్యమయాయని రమణమ్మ కనిపెట్టడానికి అట్టే కాలం పట్టలేదు. కాని, ఈ విషయం పట్టణంలోని వారికి తెలియటానికి మాత్రం చాలా కాలం పట్టింది. ఆచూకీ అంతా బాపయ్య ద్వారానే బైటపడింది. రమణమ్మకు యేడాదిబాటు కాలచక్రం కునికిపాట్లు పడుతూ దొర్లినట్లనిపించింది. అల్లుణ్ణి వెతికిరమ్మని ఆమె భర్తని నైజాం పంపటమూ, ఆయన కాళ్ళరిగేలా తిరిగి యింటికి వెర్రిమొహంతో రావటమూ జరిగి ఆరు నెలలయింది. ఆ తరువాత మరొక ఆరు నెలల వరకు రమణమ్మకు అల్లుడి పునరాగమనంపై విశ్వాసం పోలేదు.

బాపయ్య మారినంత తేలికగా రమణమ్మ మారలేదు. కాని, ఈసారి రవణమ్మలో మార్పు కనుపించిన సూచనలు బాపయ్యకి తెలియగానే పూర్వపు ఓబయ్యలా అతడు ఉండలేదు. భార్యను ధిక్కరించే వీలు అతనికి చిక్కింది.

"ఒక్కగానొక్క కూతురిని నీ ఇష్టప్రకారం పెళ్ళి చేస్తే ఏమైందో చూశావా? ఇప్పుడది కన్యా కాదు, అవివాహితా కాదు అన్నట్టుంది. ఏమిటి దాని గతి? మూన్నాళ్ళ ముచ్చట కోసం నువ్వు మురిసినందుకు దానికి వచ్చింది ముప్పు...." అన్నాడు బాపయ్య.

రమణమ్మ ఏమంటుంది? అల్లుడు నైజాంలో కాదుకదా నాక లోకంలో ఏ రూపంలో ఉన్నా

అతడు ఈ ప్రాంతంలో ఏ ప్రాణికి కనుపించడు. ఎందుచేతనంటే రాజారావు జైలు ఊచల వెనుక జీవితం గడపదలిచే పిరికిపంద కాదలచుకోలేక పోవటమే!

ఇందిరకి ఇక మరో పెళ్ళి చేయగలుతానన్న ధైర్యం రమణమ్మకు లేదు. తాను ఎరిగిన వాడు, మెడ మీద తలకాయ ఉండగా తన కూతుర్ని చేసుకుంటాననే వాడు లేడని రమణమ్మకు బాగా తెలుసు.

బాపయ్యను ఎరిగిన వాళ్ళంతా అతని మంచిని మెచ్చుకున్నా రమణమ్మ మాటకు రవ్వంత గౌరవాన్నైనా ఇవ్వరు. ఇందిర బ్రతుకు బండలు చేయటం బాపయ్యకు సుతలామూ ఇష్టం లేదు.

బ్యాంకిలో కూర్చున్నంతసేపూ అతనికి కళ్ళెదుట సుందరం విగ్రహం కనుపిస్తూంది. పూర్వం ఒకప్పుడు అతన్ని బాపయ్య నోరారా 'అల్లుడా!' అని పిలిచేవాడు. ఈ మధ్య ఆ పిలుపు అతని నోటమ్మట ఎన్నడూ రావటానికి వీల్లేకపోయింది.

పిలుపులోనే మంచి కలుపుగోలుతనం పెరుగుతుందని బాపయ్య నమ్మకం. ఇప్పుడూ ఆ పిలుపు తిరిగి చుట్టరికపు శ్రుతుల్ని మీటుతుందని అతని నమ్మకం.

"ఏం అల్లుడూ...సుందరం" అని బాపయ్య సుందరం కూర్చున్న బల్ల దగ్గరకు వెళ్ళి మెల్లిగా పిలిచాడు.

సుందరం తెల్లబోయి బాపయ్యకేసి క్షణంసేపు చూడగానే బాపయ్య మామ చూపులో అతనికి ఇందిర రూపం గోచరించగానే చిరునవ్వును ప్రసరించాడు. ఇన్నాళ్ళయాక సుందరానికి ఇందిర ప్రస్తావన సంతోషాన్ని ఎందుకు కలిగిస్తుందో కూడా అతనికే అర్థం కాదు....

"ఇందిర ఓసారి నిన్ను చూడాలంటోంది...వస్తావా?"

"అలాగే మామయ్యా!"

"దాని జీవిత సమస్యను పరిష్కరించే మార్గం నీ చేతుల్లో ఉంది" అన్నాడు – కంట నీరు తిరుగుతూండగా బాపయ్య.

సాయంకాలం ముందుగా బాపయ్య తన ఇంటికి వెళ్లి సుందరం రాక గురించి చెప్పాడు. మరో అరగంటకు సుందరం రానే వచ్చాడు. రమణమ్మ ఈ మట్టి పిసుక్కునే వాణ్ణి ఈ రూపంలో చూసి ఏడ్చింది. ఇందిర పక్క గదిలో కుర్చీలో విచారంగా చూస్తూ కూర్చుంది. ఆమె చేతిలో మాత్రం తాటిపువ్వు ఉంది. సుందరం వస్తూనే తాటిపువ్వును తీసుకున్నాడు.

తన తల్లి మాటల్ని విని ఈ విధంగా చెడ్డాననే బాధ ఆమెకు సుందరాన్ని చూస్తున్నకొద్దీ కెరటాల్లా పెరిగింది. ఆమె కన్నీటి ధారలను సుందరం తుడుస్తూ ఇలా అన్నాడు!

"నేను నీ కోసం....నువ్వు నా కోసం పుట్టామని....పూర్వం కంటె ఇప్పుడు ఎక్కువగా తెలుసుకున్నాను ఇందిరా!"

ఇందిర చిరునవ్వు నవ్వింది.

❋

*(ఆంధ్రజ్యోతి మాసపత్రిక : 1940-49 మధ్య)*